క్లుప్తంగా

రోడ్డు నిర్మాణంపై విచారణ జరపాలి

సీపీఎం కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: కాంగ్రెస్ నాయకుడి ఫామ్ హౌజ్‌కు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టిన విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ తదితరులు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.60 లక్షల ప్రభుత్వ సొమ్ముతో సొంత లాభం కోసం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా నిధుల దుర్వినియోగానికి సహకరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌తో పాటు చంద్రయ్య, రత్నం, అబ్దుల్ వాహబ్, సతీష్, మల్లేశ్, పరుశురామ్ తదితరులు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ విజయరామారావు

దుద్యాల్: మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థులకు ఎంఈఓ విజయరామారావు సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. అందులో పరీక్ష అట్ట, పెన్నులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎస్ఏ–2 పరీక్షలు శ్రద్ధగా రాయాలని, ఉన్నత విద్యకు అర్హత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, హెచ్‌ఎం అశోక్, దుద్యాల్ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు మల్లప్ప, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

ధారూరు: మధ్య తరగతి కుటుంబాల్లో ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ తోడ్పాటు ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ ధారూరు నాయకులు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన దాదాపు రూ.9 లక్షల విలువ గల చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో కోలుకోలేని స్థితిలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, అశోక్, నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, హన్మయ్య, అమరేశ్వర్‌రావు, అంజయ్య పాల్గొన్నారు.

మకరతోరణంతో అలంకరణ



దుద్యాల్: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామికి మకరతోరణంతో సోమవారం అలంకరించారు. దుద్యాల్ గ్రామానికి చెందిన అమంతగిరి నారాయణ కుటుంబ సభ్యులు రూ.32 వేల ఖర్చుతో స్వామి వారికి ఇత్తడి మకరతోరణం అందజేశారు. ఆలయాలు అభివృద్ధి చెందాలంటే అందరి సహకారం అవసరమని చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎస్‌ఐ విరాళం

బషీరాబాద్: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్ సోమవారం రూ.5వేల విరాళం అందజేశారు. మండలంలోని మల్కన్‌గిరి గ్రామంలో ఈ నెల 14న బాబాసాహెబ్ విగ్రహ స్థాపనకు గ్రామ యువజన సంఘం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి ఎస్‌ఐ శంకర్ స్పందించి నిర్వాహకులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బాలక్రిష్ణ, సభ్యులు ఎస్‌ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

వంతెన.. వాహనదారుల యాతన

- పెచ్చులూడుతున్న రక్షణ గోడలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అన్నాసాగర్ బ్రిడ్జిపై కూలిన రక్షణ గోడ



శిథిలావస్థకు చేరిన కోట్‌పల్లి వంతెనపై రేలింగ్

బంట్వారం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వంతెనలపై ఊడిన రేలింగ్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడే ముప్పు పొంచి ఉంది. కోట్‌పల్లి మండల కేంద్రంలోని వాగుపై దాదాపు 40 ఏళ్ల కిందట బ్రిడ్జి నిర్మించారు. అదే సమయంలో అన్నాసాగర్ వాగుపైన సైతం వంతెన కట్టారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ రెండు బ్రిడ్జిలకు ఇరువైపులా అప్పట్లో వేసిన సైడ్ రేలింగ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎక్కడికక్కడ ఊడి పడుతున్నాయి. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పితే అంతే

తాండూరు–సదాశివపేట రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. సిమెంటు, నాపరాతి లోడింగ్ లారీలు వందల సంఖ్యలో నేషనల్ హైవేకు చేరేందుకు ఇటుగానే వెళుతుంటాయి. ఇతర వాహనాలు లెక్కకు మించి తిరుగుతాయి. కోట్‌పల్లి ప్రాజెక్టుకు టూరిస్టులు ఇదే దారిలో కార్లు, మోటారు బైకులపై అతి వేగంగా ప్రయాణిస్తారు. ఈ క్రమంలో ఒక్కోసారి వాహనాలు అదుపు తప్పితే రక్షణగా నిలిచేందుకే ఇరువైపులా సైడ్ రేలింగ్ నిర్మాణం ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. కోట్‌పల్లి, అన్నాసాగర్ బ్రిడ్జిలు 40 ఏళ్ల కిందట నిర్మించడంతో రక్షణ గోడలు కూలుతున్నాయి. అన్నాసాగర్ వంతెనపై రేలింగ్ ఎక్కడికక్కడ ఊడిపడగా, కోట్‌పల్లి బ్రిడ్జిపై మాత్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ద్విచక్ర వాహనదారులు రాత్రివేళ అటుగా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. వంతెనల వద్ద అదుపు తప్పితే వాగులో పడాల్సిందేనని భయాందోళన చెందుతున్నారు. సైడ్ వాల్స్ అధ్వాన స్థితికి చేరినప్పటికీ రోడ్లు, భవనాల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరిగేతే కానీ పట్టించుకునేలా లేరని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల శ్రమదానం

కొడంగల్ రూరల్: పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సోమ్లానాయక్ అన్నారు. మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వేసవికాలం ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం ప్రధాన రహదారులు, పాఠశాల ఆవరణల్లో కంపచెట్లను తొలగించి మొక్కలు నాటేందుకు గోతులు తవ్వారు. పరిశుభ్రతపై గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, కళాశాల అధ్యాపకులు నర్సిములు, బాలమణి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వండి

తహసీల్దార్‌కు బసవేశ్వర భక్తమండలి వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న భక్తమండలి సభ్యులు

బషీరాబాద్: బసవేశ్వరస్వామి విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని బషీరాబాద్ మండల బసవేశ్వర భక్తమండలి సభ్యులు తహసీల్దార్ వెంకటేశ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలి సభ్యులు శ్రావణ్‌కుమార్, నాగేంద్రయ్య, రాజశేఖర్, జగదీశ్వర్, మల్లప్ప, వీరణ్ణ, రమేష్, మల్లికార్జున్, రామేశ్వర్, శానయ్య, జగ్గయ్య, సంగయ్య, గురులింగయ్య, శరణప్ప, శ్రీకాంత్, నీలకంఠేశ్వరస్వామి, జగదీశ్, మల్లేశ్‌గౌడ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

యాలాల: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యాలాల ఎస్‌ఐ గిరి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. స్మార్ట్ ఫోన్‌ల వినియోగం పెరిగినప్పటి నుంచి సైబర్ నేరాలు కూడా పెరిగాయన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, అనవసర లింకులను ఓపెన్ చేయరాదన్నారు. వీటితో డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీఎస్ సిబ్బంది ఉన్నారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక



గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కేశవులు

మర్పల్లి: మండల పరిధిలోని పంచలింగాల కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేశవులు సోమవారం తెలిపారు. పది మంది ఎంట్రెన్స్ టెస్టు రాయగా.. అందులో ఎనిమిది మందికి సీటు వచ్చింది. దీంతో పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అభినందించారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

చేవెళ్ల: పట్టణంలో ఈ నెల 12న నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్రను హిందువులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా నాయకుడు కరుణాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని గుండాల గ్రామంలో సోమవారం వీరహనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త నిష్టతో ధర్మకోసం పనిచేయాలని, హిందూ సంఘటితం కోసం నిర్వహించే వీరహనుమాన్ శోభాయాత్రలో పెద్దసంఖ్యలో హిందువులు పాల్గొనాలని పిలుపునిచ్చారు

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

కుల్కచర్ల: పేద, ధనిక ప్రజల మధ్య ఆహారం విషయంలో వ్యత్యాసం ఉండరాదనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి ఇంటికి సన్నబియ్యం అందజేస్తున్నారని కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి ప్రజల కడుపులు నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజిరెడ్డి, కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రమేశ్, డీలర్ రాజశేఖర్, నాయకులు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పెరుగుబసంతం



కార్యక్రమానికి హాజరైన భక్తులు

యాలాల: మండలంలోని జుంటుపల్లి శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పెరుగుబసంతం నేత్రపర్వంగా సాగింది. ముందుగా పెరుగు కుండను పగలగొట్టి భక్తులపై జల్లుతారు. విరిగిన కుండ ముక్కలు, పెరుగును సొంతం చేసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం సీతారాముల విగ్రహామూర్తులను ఆలయం నుంచి శేషవాహనంపై ఊరేగించారు. ఇందులో భాగంగా భక్తులు శ్రీరామస్మరణతో పరిసరాలు మార్మోగాయి.

ఉపాధ్యాయులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు ఉన్నత పదవులు పొందినప్పుడే సంతోషాన్ని పొందుతారని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. సోమవారం కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి వెంకటయ్య పదవీ విరమణ పొందడంతో అదే పాఠశాలలో పనిచేస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు హమీద్‌కు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కనకమామిడి పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు రాంచందర్, పీఆర్టీయూ మండల బాధ్యులు బందయ్య, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వైభవంగా రథోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని బస్వాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో రెండు రోజులుగా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మొదటి రోజు సీతారాముల కల్యాణంతో ప్రారంభమైన వేడుకలు సోమవారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవం, సాయంత్రం పెరుగు బసంతంతో అంబరాన్నంటాయి. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– బంట్వారం

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్‌లో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులపాటు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ దీపాల మరమ్మతుల కారణంగా పర్సాపూర్ ఫీడర్ కింద ఉన్న పర్సాపూర్, పాతకొడంగల్, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: గొడ్డలితో దారుణ హత్యకు గురైన మొగులయ్య మృతదేహానికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. సోమవారం కాంగ్రెస్ నేతలతో కలిసి ఖమ్మంనాచారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులకు సూచిస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శాంతకుమార్, నాయకులు రాములునాయక్, వెంకటనర్సమ్మ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలపై శిక్షణ

చేవెళ్ల: గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వెల్‌స్పన్ ఫౌండేషన్, ఏఐఎస్‌ఈసీటీల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్‌స్పన్ గ్రూప్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సుధీర్‌కుమార్ తెలిపారు. చేవెళ్లలో సోమవారం ఉచిత శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరాలపై బడిన నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యాల శిక్షణ తరగతులకు అర్హులని చెప్పారు. ప్రధానంగా డిమాండ్ ఉన్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్లంబర్ జనరల్, మిషన్ టైలింగ్ అనే నాలుగు కోర్సులలో యువతకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అకాలం కలిసొచ్చింది



అకాల వర్షాలు అన్నదాతలకు ఆసరాగా నిలిచాయి. ఇటీవల కురిసిన వడగళ్ల వానలతో నేలంతా తడిసిపోయింది. ఇదే అదునుగా భావించిన రైతులు వేసవి దుక్కులు దున్నుకొనే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు పంట వ్యర్థాలను కాల్చుతుండగా.. మరికొందరు ట్రాక్టర్ల సహాయంతో పొలాన్ని చదును చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కర్షకులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. ఈ క్రమంలోనే ఆలేడ్ సమీపంలో ఓ రైతు ఇలా పొలాన్ని చదును చేశాడు.

– దుద్యాల్

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

తహసీల్దార్ మునీరుద్దీన్



కడీలను తొలగిస్తున్న జేసీబీ

మర్పల్లి: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్ హెచ్చరించారు. మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో ఇటీవల నవాబుల భూములు కొనుగోలు చేసిన ఓ వ్యక్తి సర్వే నంబర్ 248లో అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా ఆక్రమించాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మునీరుద్దీన్ సోమవారం ఆర్ఐ వెంకటేశం సహా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి జేసీబీతో కడీలను తొలగించారు. అనంతరం తన కార్యాలయంలో తహసీల్దార్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సెలవు దినాలు వస్తే కొందరు బడానేతల అండదండలతో ప్రభుత్వ భూములపై కన్నేసి కబ్జాలు చేసే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక ముందు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

షాబాద్: రైతులు సాగు చేసిన పంటలు పొట్టకొచ్చి గింజబట్టే సమయంలో రైతులకు విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకొని సమస్యలు పరిష్కరించకుండా అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏఈని కలిసి వినతి పత్రం అందజేశారు. రైతులకు విద్యుత్ అవసరాన్ని ఆసరా చేసుకున్న అధికారులు డబ్బులకు ఆశపడి సకాలంలో సమస్య పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సమస్య పరిష్కరించడి సారు అంటూ రైతులు అధికారుల కాళ్లు మొక్కిన వారు కనికరించడం లేదన్నారు. మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 47లో విద్యుత్ స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరా ఐదురోజులుగా నిలిచిపోయినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదన్నారు. రైతులు ఈ విషయమై విద్యుత్ అధికారులకు తెలిపినా వారు పోలీసులకు ఫిర్యాదు చేసినా చేయమని, మీ పని త్వరగా కావాలంటే రూ.15 వేల రూపాయలు చెల్లిస్తే ప్రైవేట్ వ్యక్తులతో త్వరగా చేయిస్తామని లైన్ ఇన్‌స్పెక్టర్ చెప్పడం రైతులను ఇబ్బందికి గురిచేయడమేనన్నారు. అక్రమాలకు పాల్పడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, సభ్యులు వెంకట్‌రెడ్డి, చంద్రబాబు, నర్సింలుగౌడ్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.